క్లుప్తంగా

భీమవరం వ్యవసాయ ఏడీగా సీహెచ్ శ్రీనివాస్



భీమవరం అర్బన్: భీమవరం అగ్రికల్చర్ సబ్ డివిజన్‌కు నూతనంగా వ్యవసాయ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌గా సీహెచ్ శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో సీహెచ్ శ్రీనివాసరావు మచిలీపట్టణం ఏడీఏగా పనిచేసి డిప్యూటేషన్‌పై భీమవరంలోని డీఆర్‌సీలో పనిచేసి పూర్తిస్థాయి ఏడీఏ భీమవరం సబ్ డివిజన్‌కు శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు.

నేడు మావుళ్లమ్మవారి జ్యేష్ఠ మాస జాతర

భీమవరం (ప్రకాశం చౌక్): మావుళ్ళమ్మవారి జ్యేష్ఠ మాస జాతర మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ నిర్వాహకులు సీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం తెలిపింది. స్థానిక ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి జాతరలో పాల్గొనాలని కోరారు.

వ్యక్తిపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం మహిళ పట్ల ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడని అందిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని ఎల్‌వీఎన్ పురంగా గ్రామ శివారుకు చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన మోకా అర్జునరావు అసభ్యకరంగా ప్రవర్తిస్తూ వేధిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు.ఈ మేరకు హెడ్ కానిస్టేబుల్ పి. మహేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పెనుగొండ బీడులో నూతనంగా నిర్మించే సంపత్ వినాయకుని ఆలయానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు నలిమిల్లి వేణు ప్రతాప రెడ్డి (బాబీ), ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, చెన్నకేశవ స్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ కే అప్పారావు, పార్టీ నాయకులు కోట్ల శంకర్, నాడు దుర్గారావు, నక్క శ్రీను, కుసుమే నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి



మొగల్తూరులో బీఎల్‌ఓల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ అనితా కుమారి

మొగల్తూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని తహసీల్దార్ జి.అనితా కుమారి ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీఎల్‌ఓల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. నూతనంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేవారు ఫామ్, ఓటరు కార్డులో మార్పులు, చేర్పులు,తప్పుఒప్పులకు ఫామ్–8, ఓటు తొలగింపునకు ఫామ్–7ను వినియోగించాలన్నారు. గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఓటు హక్కు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఈకా ర్య క్రమంలో ఆర్‌ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ పరమాత్మకు విశేష పూజలు



తాడేపల్లిగూడెం (టీఓసీ): తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో బుధ వారం కృష్ణ పరమాత్మకు, పరివార దేవతలకు విశేష పూజలు, అనంతరం హరిసర్వోత్తమ భజన మండలి సభ్యులచే పురందరదాసు కీర్తనలు శ్రావ్యంగా ఆలపించారు. ప్రవచనాల్లో భాగంగా సత్యహరిశ్చంద్ర ధర్మాన్ని, సత్యవాక్ పరిపాలన విధానాలను గురించి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సుబ్రహ్మణ్యం, మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయలేదు

ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజల నమ్మకాన్ని తాను ఏనాడు వమ్ము చేయలేదని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ స్పష్టం చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడ పోటీ చేసినప్పటికీ తాను స్థానికుడినని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అభివృద్ధి జరగాలనే పట్టుదలతో పనిచేస్తానని ప్రజలు భావించి తనను గెలిపించారని అన్నారు. వారి నమ్మకాన్ని పూర్తిస్థాయిలో నిలబెట్టుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. భీమవరం రెండో పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో బుధవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 33వ వార్డులో రూ.41.50 లక్షలతో శ్రీరాంపురం పంట కాలువ వద్ద నుంచి డీఎన్ఆర్ కాలేజీ రోడ్డు హన్సి కల్యాణ మండపం వరకు నిర్మాణం చేసిన బీటీ రోడ్డు, సీసీ డ్రైన్ ఆర్సీసీ స్లాబ్ కల్వర్టును ఆయన ప్రారంభించారు. 31వ వార్డు బలుసుమూడిలో రూ.1.05 కోట్లతో నిర్మించే కొత్త రామాలయం నుంచి ఆదిత్య జూనియర్ కాలేజీ వరకు సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ ఆర్సీసీ స్లాబ్ కల్వర్ట్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా భీమవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలు సూచించిన విధంగా, కోరుకున్న విధంగా అభివృద్ధి పనులు చేయాలని సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పనులు చేపట్టామన్నారు. భీమవరం నియోజకవర్గంలో నవరత్నాల రూపంలో ప్రజలకు ఈ నాలుగేళ్ల కాలంలో రూ.1,200 కోట్ల మేర లబ్ధి జరిగిందని అన్నారు. భీమవరంలోని పేద ప్రజల సొంతింటి కలను నిజం చేసేందుకు 190 ఎకరాల భూమిని సేకరించి పేదలకు పట్టాలను ఇచ్చి గృహ నిర్మాణాలను ప్రారంభించామని అన్నారు. భీమవరంలో రైల్వే గేటు ఉన్న ప్రతి చోటా కూడా అండర్ టన్నెల్స్‌ను నిర్మించామన్నారు. అభివృద్ధికి ఆటంకాలు కలిగించి, అవాంఛనీయ సంఘటనలు జరిగేలా, ఉద్రిక్త పరిస్థితులు నెలకొనే విధంగా ఎవరైనా చేయాలనుకుంటే అది చాలా తప్పిదమని, ప్రజలు హర్షించరని ఈ విషయాన్ని ప్రతిపక్షాలు తెలుసుకోవాలని ఆయన హితవు పలికారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల నర్సింహరాజు, పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, కోడే యుగంధర్, జేసీఎస్ కన్వీనర్ గాదిరాజు తాతరాజు, బొర్రా వాసు, మానేపల్లి నాగేశ్వరరావు, నందమూరి ఆంజనేయులు, రేవూరి గోగురాజు, కొట్టి కుటుంబ రావు, కట్టా కనకరాజు, కోమటి రాంబాబు, గంటా సుందర్‌కుమార్, పాలపర్తి జోనా, జంగం మాణిక్యాలరావు, పెచ్చెట్టి ప్రసాద్, రామాయణం సత్యనారాయణ, మేకా వాసు, చిగురుపాటి సందీప్, మానుకొండ ప్రదీప్, ముత్యాల రామారావు, బాలజ్యోతి మూర్తి పాల్గొన్నారు.

శరవేగంగా సచివాలయ భవన నిర్మాణ పనులు



సిసలిలో సచివాలయ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ఏఈ రమేష్

కాళ్ల: మండలంలో సిసలి గ్రామంలో సచివాలయ భవన నిర్మాణ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గణేశ్నరాం బాబు పర్యవేక్షణలో నిర్వహిస్తోన్న ఈ పనులను పంచాయతీరాజ్ శాఖ ఏఈ రమేష్ బుధవారం పరిశీలించారు. గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి గడ్డివాము దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఉండి: స్థానిక దేవునిగుడిదొడ్డి ప్రాంతంలో గేదెల వ్యాపారి బూరాడ సత్తిబాబుకు చెందిన గడ్డివాము బుధవారం ఉదయం విద్యుత్ వైర్లు తగిలి దగ్ధమైంది. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ జిల్లా ఇన్‌చార్జి సాలా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.40 వేలు నష్టం వాటిల్లినట్టు తెలిపారు.

బస్ షెల్టర్ ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో తాడేపల్లిగూడెం – నల్లజర్ల రహదారిని ఆనుకుని దాత పరిమి వెంకట్రావు నిర్మించిన బస్ షెల్టర్‌ను బుధవారం సర్పంచ్ పోతుల అన్నవరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాత వెంకట్రావును అభినందించారు. వార్డు మెంబర్లు, పెద్దలు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ



ఆహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రపంచ ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో భీమవరం గొల్లవాని తిప్ప రోడ్డులోని డంపింగ్ యార్డ్ వద్ద యానాది కుటుంబాలకు భోజనం ప్యాకెట్లు, మంచినీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భీమవరం రూరల్ ఎస్సై మోహన్‌రావు విచ్చేసి నిర్వాహకులను అభినందించారు. నిర్వాహకులు అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో వేడిని సైతం లెక్కచేయకుండా శ్రమిస్తున్న యానాది కుటుంబాలకు ఆహార భద్రత దినోత్సవ సందర్భంగా కూర్మ వెంకటలక్ష్మి సౌజన్యంతో సంపూర్ణంగా భోజనం ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి బాలాజీ, మణికంఠ వెంకటేష్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ హెల్మెట్లు



ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ హెల్మెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: మండు టెండలో సైతం ట్రాఫిక్ పోలీసులు ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఎండలో ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసులకు ప్రభుత్వం ఎయిర్ కూలింగ్ హెల్మెట్లను ప్రభుత్వం అందిస్తోంది. దీనిలో భాగంగా భీమవరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఎయిర్ కూలింగ్ హెల్మెట్ల ట్రయల్స్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. ఆయనే స్వయంగా ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు హెల్మెట్ అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ట్రాఫిక్ పోలీసు అనేక ఇబ్బందులు పడుతున్నారని వెల్లడించారు. ముఖ్యంగా దుమ్ము దూళితో పాటుగా మండుటెండలో సైతం తమ బాధ్యతను నిర్వర్తిస్తున్నారని, అందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారికి ఎయిర్ కూలింగ్ హెల్మెట్లను పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, తోట భోగయ్య, ఏఎస్ రాజు, ట్రాఫిక్ సీఐ దాసు పాల్గొన్నారు.

సత్యనారాయణమ్మ మృతి తీరని లోటు

వీరవాసరం:మాజీ ఎంపీటీసీ సభ్యులు కడలి సత్యనారాయణమ్మ మృతి తీరని లోటని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ తెలిపారు . రాయకుదురు ఆమె స్వగృహంలో ఎంపీటీసీ చిత్రపటానికి పూల మాలలు వేసి బుధవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో భీమవరం జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, గూడూరి ఓంకార్, కడలి ధర్మారావు, కడలి సత్యనారాయణ, కడలి శ్రీనివాస్, గొలగాని సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్, పేరిచర్ల విజయ నరసింహ రాజు, ఏఎస్ఎన్ రాజు, తోట భోగయ్య, నాగరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సాక్షి, భీమవరం: ఆటలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం కేజీఆర్ఎల్ కళాశాల క్రీడా మైదానంలో భీమవరం ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని అందిస్తాయని అన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ 10 రోజులపాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, విజేతలకు రూ.లక్ష, రన్నర్లకు రూ. 50 వేలు నగదు బహుమతి అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, తోట భోగయ్య, కోడె యుగంధర్, కమిటీ సభ్యులు చుక్క కిషోర్, చందు, నర్సి, బైరెడ్డి రామ కృష్ణ, జాన్, సురేష్, శివరాం, ఆకుల ప్రసాద్, రాజేష్, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్లమ్మవారికి వెండి కవచం సమర్పణ



ఎల్ఎన్‌పురంలో పర్లమ్మవారికి వెండి కవచాన్ని సమర్పిస్తున్న భక్తులు

కాళ్ల: మండలంలోని ఎల్ఎన్‌పురం శ్రీశ్రీశ్రీ పర్లమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మందపాటి పేర్రాజు, వెంకటలక్ష్మి దంపతుల కుమారులు హరికృష్ణ, రామాంజనేయులు ఆర్థిక సాయం రూ.లక్షతో వెండికవచాన్ని అమ్మవారికి సమర్పించారు. ఈ కవచాన్ని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ కందుల వెంకట మల్లికార్జునరావు అమ్మవారికి అలంకరించారు. దాత కుటుంబన్ని గ్రామ పెద్దలు సత్కరించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు, జెడ్పీటీసీ పచ్చిగోళ్ల సోమేశ్వరావులు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో గ్రామస్తులంతా సుభిక్షంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తానింకి నాగరాజు, ఎంపీటీసీ శీలబోయిన సత్యనారాయణ, బొండాడపేట సర్పంచ్ గోళ్ల వెంకట సత్యనారాయణ, ఉద్దరాజు శ్రీనివాసరాజు, మందపాటి వెంకన్న, కందుల ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోపాటు అభివృద్ధికి ప్రాధాన్యం



మేడపాడులో ఆరోగ్యకేంద్రం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

యలమంచిలి: జగనన్న ప్రభుత్వంలో నవత్నాల పేరిట పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులకు ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ చెప్పారు. మేడపాడులో జల్ జీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్న అదనపు వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను, నాడు నేడు పథకంలో రూ.1.50 కోట్లతో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులను బుధవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగేళ్లలో అవినీతి, సిఫారసులకు అవకాశం లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత మన ప్రభుత్వానిదన్నారు. అదే సమయంలో సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజలకు ప్రభుత్వ సేవలు త్వరగా అందుకునేలా చేసిన ఘనత కూడా జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఈ విషయాలను ప్రజలకు గుర్తు చేసి వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో మరొకసారి జగనన్న ముఖ్యమంత్రిగా ఎన్నుకునేలా ప్రజలకు ఉత్తేజ పరిచే బాధ్యత సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు, సచివాలయ కన్వీనర్లు తీసుకోవాలని ఆయన కోరారు. వచ్చే ఎన్నికల నాటికి ప్రస్తుతం జరుగుతున్న పనులన్నింటినీ పూర్తి చేసే బాధ్యత తాను తీసుకుంటానని శ్రీనివాస్ చెప్పారు. ముందుగా పెనుమర్రు వద్ద చించినాడ కాల్వలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఆయన వెంట పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, సర్పంచ్ గంటా శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు డేగల సూర్యప్రభ ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్ నాయకులు రావూరి వెంకట కోటి మురళీకృష్ణ, గంధం సత్యకీర్తి, డేగల వెంకటేశ్వరరావు, అడబాల రామ్మోహనరావు, గాది వరదయ్య, బాలం అంజిబాబు, వర్ధనపు వెంకటేశ్వరరావు, కుక్కల సుబ్బారావు, కుక్కల ఆంజనేయులు, కుక్కల సూరయ్య, కుక్కల బాలచంద్రన్, గుత్తుల వెంకట్రావు తదితరులు ఉన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ అధిక బిల్లులు



సమావేశంలో మాట్లాడుతున్న ఆక్వా రైతు సత్యనారాయణ

కాళ్ల: విద్యుత్తు, మత్స్య శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల అధిక మొత్తంలో విద్యుత్ బిల్లులు వచ్చాయని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాళ్లకూరు గ్రామంలో అధిక విద్యుత్ బిల్లులు రావడంపై ఆక్వా రైతులు బుధవారం విలేకర్లతో మాట్లాడారు. గతంలో సబ్సిడీ పోను రూ.50 వేలు వచ్చే విద్యుత్ బిల్లులు రూ.2 లక్షలు, రూ.3 లక్షలు వరకు వచ్చాయన్నారు. కాళ్లకూరులో 39 మంది రైతులకు విద్యుత్ సబ్సిడీ తొలగించి, అధిక విద్యుత్ బిల్లులు వేయడం దారుణమన్నారు. కాళ్ల మండలంలో 180 మంది ట్రాన్స్‌ఫార్మర్లకు సంబంధించి ఫిషరీస్ అధికారులు ఈ షిప్ నమోదు చేయలేదన్నారు. దీంతో గత కొంత కాలంగా తమకు వస్తున్న విద్యుత్ సబ్సిడీలను తొలగించి విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచి ఇస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే స్పందించి 180 మంది రైతులకు ఈ షిప్ నమోదు చేసి, తొలగించిన విద్యుత్ సబ్సిడీలను పునరుద్ధరించాలని కోరారు. సమావేశంలో బొర్రా వీర వెంకట సత్యనారాయణ, తానుకొండ వెంకట్రావు, దండు ప్రణవమూర్తి రాజు, పెన్మెత్స పృధ్విరాజు, పెన్మెత్స సురేష్ రాజు, కె.నాగేశ్వరరావు, బొర్రా శ్రీనివాసరావు, డొక్కు సుబ్రహ్మణ్యం, వీరమల్లు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గోశాల నిర్వాహణకు సమస్యలు సృష్టించవద్దు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని 6వ వార్డులో నిర్వహిస్తున్న భక్తాంజనేయ గోశాల నిర్వాహణకు సమస్యలు సృష్టించవద్దని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరిశే సోమేశ్వర రావు, యువమోర్చా అధ్యక్షుడు గరగ ప్రసాద్‌లు హెచ్చరించారు. పట్టణంలో నిర్వహిస్తున్న గోశాలను బీజేపీ నాయకులు బుధవారం సందర్శించారు. వారు మాట్లాడుతూ గోవులవల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, అటువంటి గోశాలను నిర్వహించకుండా చేసేందుకు కొందరు సమస్యలు సృష్టిస్తున్నారని, అనేక ఇబ్బందులు పెడుతున్నారన్నారు. గోశాల నిర్వాహణకు అడ్డుపడితే బీజేపీ పార్టీ తరుపున ఉద్యమిస్తామన్నారు. గోశాల నిర్వాహకులు నార్ని త్రిమూర్తులు, తదితరులు ఉన్నారు.

ఘనంగా పృధ్వీరాజ్ చౌహాన్ జయంతి



నాగిడిపాలెంలో పృధ్వీరాజ్ చౌహాన్ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: దేశం గర్వించదగ్గ గొప్ప జాతీయ వీరుడు పృధ్వీరాజ్ చౌహాన్ అని, దేశ సంపదను ఇతరులు పాలు కాకుండా తన పోరాట పటిమతో ఎంతోమందిని మట్టి కరిపించారని అగ్నికుల క్షత్రియ యూత్ ఫోర్స్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెమ్మాడి కిరణ్ కుమార్, జాతీయ అధికార ప్రతినిధి కొల్లాటి రాజ్‌కుమార్ వర్మ అన్నారు. భీమవరం మండలంలోని నాగిడిపాలెంలో పృధ్వీరాజ్ చౌహాన్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్, రాజ్‌కుమార్ వర్మలు మాట్లాడుతూ భారతదేశంపై 16సార్లు దండెత్తిన మహ్మద్ ఘోరీని ఓడించి రాజ్య స్థాపనను పృధ్వీరాజ్ చౌహాన్ సుస్థిరం చేశారన్నారు. పృధ్వీరాజ్ చౌహాన్ దేశ భక్తితో తన వీరత్వంతో ఎంతోమంది విదేశీ చక్రవర్తులను ఓడించారని గుర్తు చేశారు. మొట్టమొదటి అగ్నికుల క్షత్రియ చక్రవర్తిగా ఢిల్లీ సింహాసనాన్ని అధిష్టించారన్నారు. ముందుగా పృధ్వీరాజ్ చౌహాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ యూత్‌ఫోర్స్ జిల్లా అధ్యక్షుడు నాగిడి శ్యామ్‌కుమార్, వాతాడి కనకరాజు, నాగిడి ఏడుకొండలు, బొమ్మిడి ఈశ్వరరావు, తిరుమాని బండి ముత్యాల రాజు, ఒడుగు నారాయణ, నాగిడి గణపతి, నాగిడి బాలకృష్ణ పాల్గొన్నారు.

డ్రోన్ సర్వేతో పారదర్శకంగా హద్దులు



పోడూరులో డ్రోన్ సర్వేను పరిశీలిస్తున్న ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్

పోడూరు: డ్రోన్ సర్వేతో వ్యవసాయ భూములకు పారదర్శకంగా హద్దులు నిర్ణయిస్తామని తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు అన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా పోడూరులో బుధవారం డ్రోన్ సర్వే ను ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దాదాపు 100 ఏళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా డ్రోన్ ద్వారా రీ సర్వే పక్రియ జరుగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ప్రయోజనాల కోసం రూపకల్పన చేసిన జగనన్న శాశ్వత భూహక్కు– భూరక్ష పథకం ద్వారా దేశవ్యాప్తంగా మన రాష్ట్రంలో మాత్రమే వ్యవసాయ భూముల రీసర్వే పక్రియ జరుగుతోందన్నారు. దీని ద్వారా అటు ప్రభుత్వానికి, ఇటు రైతాంగానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రీసర్వే పక్రియకు రైతులంతా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోడూరు, మినిమించిలిపాడు సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, రామన వీర్రాజు, ఆర్ఐ కె.రాంబాబు, వైస్ఎంపీపీ ఇందుకూరి సీతారామరాజు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం



పాలకొల్లులో శ్రీ లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా శ్రీ లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. మారేపల్లి పేరిశాస్త్రి బ్రహ్మత్వంలో జరిగిన ఈ హోమంలో 17 మంది దంపతులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ భక్తులకు స్వామివారి శేషవస్త్రంతో పాటు ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం పూజలో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పెనుగొండలో..

పెనుగొండ: సంకష్ట హర చతుర్థి సందర్భంగా పెనుగొండ పంచాయతీ వద్ద సంపత్ వినాయకుని ఆలయం వద్ద లక్ష్మీ గణపతి హోమం భక్తి శ్రద్దలతో నిర్వహించారు. బుధవారం శుక్ర ఆయుర్వేజ పండితులు వడగం సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కావూరి బాలకృష్ణ శర్మ పూజలు, అభిషేకంలు నిర్వహించారు. 2007 నుంచి ఆలయంలో హోమాలు, పూజలు, ప్రతీ నెలా సంకష్టహరచతుర్థి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తేతల శ్రీరామారెడ్డి తెలిపారు. భక్తి శ్రద్ధలతో హోమం నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో బుధవారం క్లబ్ రీజియన్ చైర్‌పర్సన్ మదన్మోహన్ అగర్వాల్ నివాసం వద్ద జరిగిన కార్యక్రమంలో పేద విద్యార్థినికి సైకిల్, మహిళకు కుట్టు మిషన్ పంపిణీ, ఇతర సేవలు అందజేశారు.ఈ కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, క్లబ్ పట్టణ అధ్యక్షులు సన్నిధి సూర్యనారాయణ మూర్తి, సెక్రటరీ వి.రామమోహన్ రావు, కోశాధికారి చిన్నం జగదీష్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, పేరిచర్ల మురళీకృష్ణం రాజు, సుంకర శ్రీనివాస్, సత్తి జగదీష్ రెడ్డి, వట్టిప్రోలు రాము తదితరులు పాల్గొన్నారు.